జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 7-4-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 303 పేజీలు: 4 వెల : రూ.7



## టింబర్ డిపోలు.. షా మిల్లుల్లో..
# గుట్టలు గుట్టలుగా కలప

శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 6 (వార్త): శ్రీకాకుళం జిల్లాలో టింబర్ డిపోలు, కర్రల షామిల్లులు కలపతో కిటకిటలాడుతోంది. ఏ డిపోకు వెళ్లినా, షా మిల్లులు చూసినా కలప గుట్టలుగుట్టలుగా కనిపిస్తోంది. ఎక్కువగా టేకు రకం కలపే దర్శనమిస్తోంది. ఇక్కడి టేకు కలపను చూస్తుంటే జిల్లాలోని అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున టేకు చెట్లు నరికివేస్తున్నట్టు అనుమానాలు కలుగుతున్నాయి. మైదాన ప్రాంతాల్లో టేకు చెట్లు నరికివేయాలంటే మండల అధికారి అనుమతి ఉండాలి. అదే అటవీ ప్రాంతంలో టేకు చెట్లు కొట్టకూడదు. ఒకవేళ ప్రకృతి వైపరీత్యాలు వల్ల చెట్లు పడిపోతే వాటిని తరలించేందుకు అటవీ శాఖాధికారుల అనుమతులు ఉండాలి. మరి ఈ కలప టింబర్ డిపోలకు, కర్రల షామిల్లులకు ఏవిధంగా వస్తుందో ఆ పెరుమాళ్‌కే ఎరుక. షా మిల్లుకు వచ్చిన కలపను ముక్కలు ముక్కలుగా చేసి వాటిని టింబర్ డిపోలకు తరలిస్తుంటారు. వాటిని ఆ డిపో నిర్వాహకులు విక్రయిస్తుంటారు. జిల్లా పునర్విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో అటవీ ప్రాంతం అంతంత మాత్రంగా మారింది. మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, హిరమండలం, కొత్తూరు, టెక్కలి తదితర ప్రాంతాలతో పాటు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట, భామిని మండలాల్లో సామాజిక అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో టేకు ప్లాంటేషన్లు ఉన్నాయి. అటవీ శాఖ కోట్లు ఖర్చు చేసి టేకు చెట్ల పెంపకం చేస్తోంది. ఈ చెట్లు పెద్దవయ్యాక గుట్టుచప్పుడు కాకుండా కొందరు అధికారుల కనుసన్నల్లోనే ఓ ముఠా కొట్టేసి రాత్రివేళల్లో తరలించుకుపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. టింబర్ డిపోలు, షా మిల్లుల్లో కలపను చూస్తే అడవిలో చెట్లు ఏ మేరకు మాయం అవుతున్నాయి. వీరు ఎక్కడి నుంచి కొనుగోలు చేస్తున్నారు, అటవీ అధికారుల సహకారం లేకుండా ఎలా తీసుకువస్తున్నారు అన్న అనుమానం కలుగకమానదు. శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో పెద్ద ఎత్తున టింబర్ డిపోలు ఉన్నాయి. కొందరు అటవీశాఖ సిబ్బంది నిత్యం ఈ డిపోల వద్దే కాలయాపన చేస్తుంటారు. వీటిని నిర్వహిస్తున్న యజమానులతో వీరంతా సత్సంబంధాలు కలిగివుంటున్నారని ఆ శాఖలోని సిబ్బందే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. అడవిని కాపాడాల్సిన వారే చెట్లు కొట్టేసేవారితో చేతులు కలిపి ఈ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారంటూ గుసగుసలు కూడా ఉన్నాయి. ఇకనైనా జిల్లా అటవీ శాఖాధికారి స్పందించి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా టింబర్ డిపోలు, కర్రల షామిల్లులు తనిఖీ చేస్తే అక్రమ కలప దందా, రవాణా, సహకరిస్తున్నది ఎవరు అన్నది బయటపడే అవకాశం ఉంది.

(శ్రీకాకుళం జిల్లాలో టింబర్ డిపోలు, కర్రల షామిల్లుల్లో కొందరు అటవీ అధికారుల వాటాలు, టింబర్ డిపో నిర్వాహకుడి ఇంటిలో అద్దెకు ఉన్నది ఎవరు.. అన్న కథనాలు.. త్వరలో )

* ఎక్కడి నుంచి వారు తెస్తున్నారు * వారికి అనుమతులు ఎవరిస్తున్నారు * అధికారుల తనిఖీలు అంతంత మాత్రమేనన్న విమర్శలు * టింబర్ డిపోల నిర్వాహకులతో కొందరు అటవీశాఖాధికారులు, సిబ్బంది కుమ్మక్కు * కలప అక్రమ రవాణాకు వారే వెన్నుదన్ను * ప్రతినెలా కొందరు అధికారులకు మామూళ్లు * అడవిలో మాయమవుతున్న విలువైన కలప చెట్లు



## హైవే అడ్డాగా..
# పశు విక్రయాలు

* సిండికేట్ అయిన పశువ్యాపారులు, దళారులు * ఒడిశా నుంచి జిల్లా సరిహద్దుకు పశువులు తీసుకువస్తున్న దళారులు * అక్కడి నుంచి హైదరాబాద్, కోలకత్తాకు అక్రమ రవాణా * బరంపూర్ వాసి కనుసన్నల్లోనే ఈ దందా * ప్రతివారం కోట్లలో పశువులు క్రయవిక్రయాలు * కొందరు పోలీసుల కనుసన్నల్లోనే వ్యాపారమంటూ విమర్శలు

**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** ప్రభుత్వం పశువులు అక్రమ రవాణా అరికట్టే చర్యలు తీసుకుంటున్నా.. ఫలితం ఇవ్వడం లేదు. నిత్యం పశువులు కళేబరాలకు తరలింపు సాగుతునే ఉంది. కొందరు ధనార్జేనా ధ్యేయంగా ఈ వ్యాపారాన్ని కొన్నేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా చేసుకుపోతున్నారు. ఇచ్ఛాపురం మీదుగా విజయవాడ, హైదరాబాద్, బెంగాల్ ప్రాంతాలకు పెద్ద పెద్ద కంటైనర్లు ద్వారా తరలించుకుపోతున్నారు. ఎక్కువగా శుక్ర, శని, ఆదివారాల్లో ఆవులు, గేదెలను రవాణా చేస్తున్నారు. ఒడిశా ప్రాంతం నుంచి పశువులను సరిహద్దు ప్రాంతాలకు దళారులు తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఇచ్ఛాపురం, కంచిలి హైవే అడ్డాగా ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఈ మూడు రోజులు పాటు కోట్లలో వ్యాపార లావాదేవీలు కొనసాగుతోందని కొందరు దళారులు చెబుతున్నారు. పశువుల అక్రమ రవాణాదారులు, దళారులు సిండికేట్ అవుతున్నారు. ఈ సిండికేట్‌కు అంతా శ్రీనివాసుడే కీలకమని సమాచారం. బరంపురానికి చెందిన ఓ వ్యక్తి కనుసన్నల్లోనే అంతా జరుగుతోందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ పెద్ద మనిషి ఎవరెవరికి ఎంతెంత ఇవ్వాలి, పోలీసులు పట్టుకోకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి. ఎవరికి విక్రయించాలి అన్నది ఆయన ఆధ్వర్యంలో జరుగుతోందట. ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు నిఘా పెడితే ఈ వ్యవహారం బయటకు వస్తుంది. అయితే కొందరు పోలీసు తదితర శాఖల అధికారులకు వారం వారీగా మామూళ్లు వెళుతుండడంతో వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అయితే పశు విక్రయం చేస్తున్న వారు మాత్రం మూడు నెలలుగా పశువుల విక్రయం జరగడం లేదని బయటకు చెబుతున్నా.. గుట్టుచప్పుడు కాకుండా నిరంతరం ఈ పశువుల తరలింపు సాగుతునే ఉంది. జిల్లా పోలీసుశాఖ ఉన్నతాధికారులు దీనిపై గట్టి నిఘా పెడితే ఈ బండారం బయటపడే అవకాశం ఉందన్న అభిప్రాయం జిల్లావాసుల్లో ఉంది.






## జై.. శ్రీరామ్

* జిల్లావ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు * వైభవంగా సీతారాముల కల్యాణం * రామనామంతో మార్మోగిన ఆలయాలు * కిటకిటలాడిన మందిరాలు

## నాగేశ్వరరావుకు ఉగాది నంది పురస్కారం

**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** పలాస మండలం లొద్దబద్ర గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్లె నాగేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. రాజమండ్రిలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ సౌజన్యంతో ఈ నెల నాలుగవ తేదీన నిర్వహించిన కార్యక్రమంలో ఉగాది నంది పురస్కారాన్ని అందుకున్నారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ సాహిత్యం, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా చేస్తున్న సేవలకు ఈ పురస్కారం అందింది. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, గజల్ శ్రీనివాస్‌లు ఈ పురస్కారాన్ని అందజేశారు.



### శ్రీకాకుళం నగరానికి..

# హైటెక్ మోడల్ మార్కెట్

* ఈనెల 15న పునర్నిర్మాణానికి శ్రీకారం * కేంద్ర రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 (వార్త):** శ్రీకాకుళం నగర అభివృద్ధిలో భాగంగా పొట్టి శ్రీరాములు మార్కెట్ పునర్నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆదివారం ఉదయం రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, మున్సిపల్ కమిషనర్ తదితర అధికారులు మార్కెట్ ప్రాంగణాన్ని సందర్శించారు. అమ్మకందారులు, వినియోగదారుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌లోనే ఉన్న శ్రీరాముని ఆలయంలో పూజలు నిర్వహించారు. మార్కెట్‌ను సందర్శించడానికి వచ్చిన మంత్రులకు, ఎమ్మెల్యేకు వ్యాపారులంతా పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ, గత పాలకులు ఎలాంటి సలహాలు, ప్రణాళికలు లేకుండా నిర్మించిన దుకాణాలు ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉండిపోయాయని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పుడు సమగ్ర ప్రణాళికతో అందరికీ ఉపయోగపడే విధంగా 'యు' ఆకారంలో నూతన మోడల్ మార్కెట్‌ను నిర్మించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 15 నుంచి మార్కెట్‌ను ఖాళీ చేసి, పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. విశాల పార్కింగ్, ఆధునిక గోదాములు, మార్కెట్‌కు అవసరమైన అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్లాన్ చేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఈ మార్కెట్ పునర్నిర్మాణం వల్ల వ్యాపారులతో పాటు, కొనుగోలుదారులు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నదీ పరివాహక ప్రాంతంగా ఉన్న ఈ నగరంలో పార్కులు, పరిశ్రమలు, రివర్ వ్యూ, పిపిపి మోడల్లో ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని వివరించారు. కేంద్రం నుంచి మరిన్ని నిధులు రప్పించి జిల్లాకు కొత్త రూపమివ్వడమే లక్ష్యమన్నారు. ఈ పర్యటనలో కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ హెల్త్, ఇంజనీరింగ్ సిబ్బంది హాజరయ్యారు.



## ఆపరేషన్ కగార్ సదస్సు జయప్రదం చేయండి

**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** ఆపరేషన్ కగార్ సదస్సు జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ పిలుపునిచ్చారు. ఈనెల 10న సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కాశీబుగ్గ గణపతి రెసిడెన్సీలో సదస్సు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చాపర వెంకటరమణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతూ ఖనిజ సంపదను వారికే కట్టబెడుతోందన్నారు. దీన్ని అడ్డుకుంటున్న మావోయిస్టులను కిరాతకంగా చంపేస్తున్నారన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు ముందుకువస్తున్నా మోదీ సర్కారు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో చాపర వేణుగోపాల్, మద్దిల రామారావు, వంకల మాదవరావు, పత్రి దానేసు, కొర్రాయి నీలకంఠం, పుచ్చ దుర్యోధన, మద్దిల ధర్మారావు, పోతనపల్లి వైకుంఠం, కొర్రాయి జోగారావు మాస్టారు, సూరి పాపారావు, దాలయ్య, గణపతి, సార జగన్ పాల్గొన్నారు.

## విద్యార్థి నిజాయితీ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6 (వార్త):** ఇచ్ఛాపురం డబ్బురు వీధికి చెందిన పతి ఆకాష్ మొబైల్ ఫోన్ స్వేచ్ఛావతి అమ్మవారి గుడి దగ్గర పోయింది. ఆ ఫోన్ గిలాయి వీధికి చెందిన బర్రు చంటి అనే గవర్నమెంట్ హైస్కూల్లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థికి దొరికింది. ఆవిద్యార్థి ఆ సెల్ ఫోన్‌ను ఇచ్ఛాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి అప్పగించాడు. ఈ ఫోన్‌ను పతి ఆకాష్‌కు పోలీసులు అందజేశారు. దొరికిన ఫోన్ అప్పగించినందుకు బర్రు చంటికి సిఐ చిన్నం నాయుడు, ఎస్ఐ ముకుందరావు, ఇచ్ఛాపురం టౌన్ హెచ్‌సి ఉమామహేశ్వరరావు సిబ్బంది అభినందించారు.

## మంత్రి నాదెండ్ల జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6 (వార్త):** జనసేన పీఏసీ చైర్మన్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జన్మదినం సందర్భంగా జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జీ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు రామాలయంలో పూజలు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలను వైద్యురాలు గౌతమి సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రొకల భాస్కర్, కర్రి నాగరాజు, శ్యామ్ రెడ్డి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### దేశం కోసం.. ధర్మం కోసం

# పాటుపడే పార్టీ బీజేపీ

* పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి * పార్టీ శ్రీకాకుళం మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు * జెండా ఆవిష్కరణ * ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



**టెక్కలి, ఏప్రిల్ 6 (వార్త):** దేశ భవిష్యత్ కోసం, ధర్మం కోసం పాటుపడే పార్టీ బీజేపీ అని పార్టీ శ్రీకాకుళం మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం టెక్కలి బీజేపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భవ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పేదల పక్షాన నిలబడే పార్టీ భారతీయ జనతా పార్టీ అని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలోనే కూటమి ప్రభుత్వమే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఎత్తున కేంద్రం నిధులు మంజూరు చేసి ఆదుకుంటోందన్నారు. పార్టీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలు, నాయకులపై ఉందని తెలిపారు. మనోజ్ కుమార్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. టెక్కలి మండలం అధ్యక్షులు జర్జాన రాంజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నడుపూరు లక్ష్మీనారాయణ, గూన మీనా కుమార్, బూరె నరేంద్ర చక్రవర్తి, లింగరాజు, జర్నీ పరమేశ్వరరావు, ఉమా బాబు, నాగేంద్ర, రమేష్, దుపాన రాజ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**గార:** మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను నాయకులు ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో నేతలు మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో పార్టీ బలపడుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ గార మండల అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మి, నాయకులు సాధు కిరణ్ కుమార్, రావాడ పురుషోత్తం, మైలపల్లి జనార్దన్ రావు, బైరి అప్పారావు, డీలర్ రాంబాబు పాల్గొన్నారు.



### డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక

## కార్యకలాపాలకు అడ్డుకట్టు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6 (వార్త):** టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్‌తో నిఘా పెట్టి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్నామని ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు. నిర్మానుష్యమైన ప్రదేశాలు, నది పరివాహక ప్రాంతాలు, పట్టణ, గ్రామీణ చివర ప్రాంతాలలో డ్రోన్లు ఎగురవేసి నిఘా ఉంచుతున్నామని చెప్పారు. బహిరంగంగా మద్యం, గంజాయి తాగినా, పేకాట ఆడినా, ఈవ్‌టీజింగ్ పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ఈ డ్రోన్లు సహాయపడతాయన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# జై.. శ్రీరామ్

* జిల్లావ్యాప్తంగా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు * వైభవంగా సీతారాముల కల్యాణం * రామనామంతో మార్మోగిన ఆలయాలు * కిటకిటలాడిన మందిరాలు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 6(వార్త):** శ్రీరామనవమిని పురస్కరించుకుని జిల్లాలోని రామ మందిరాలు శ్రీరామనామ నినాదంతో మార్మోగింది. శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. శ్రీకాకుళం నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండరామాలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. బంకుపల్లి శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఈవో సర్వేశ్వరరావు, ఉపనిషత్ మందిరం సభ్యులు పాల్గొన్నారు. అలాగే బొందిలీపురంలోని తుల్జాభవానీ ఆలయంలో ధర్మకర్త రాంగోపాల్ సింగ్ ఆధ్వర్యంలో శ్రీరామ కల్యాణం ఘనంగా నిర్వహించారు. బలగ, కాలభైరవ పీఠం, రెల్లవీధి, తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.



**పలాస:** శ్రీరామనవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రైల్వే స్టేషన్ రోడ్ సీతారామాలయంలో వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు చెందిన వేలాదిమంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 6 గంటల నుంచి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. అలాగే బాబా ధ్యానమందిరంలో మహిళలతో సామూహిక సాయిసత్యవ్రతాలు జరిపించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, ఆర్డీఓ జి.వెంకటేష్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, ఎంపీడీఓ కె.వసంతకుమార్, సిఐ పి.సూర్యనారాయణతో పాటు ప్రముఖులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే మొగిలిపాడు, చిన్నబ్రాహ్మణవీధి, రామాలయం, అంబుసోలి, తర్లాగడూరు తదితర ప్రాంతాల్లోని రామమందిరాల్లో సీతారాములకు ఎమ్మెల్యే గౌతు శిరీష పూజలు చేశారు. ఆమె వెంట పలాస ఏఎంసి అధ్యక్షులు మల్ల శ్రీనివాసరావు, టీడీపీ నేతలు లోడగల కామేశ్వరరావు, గురుటి సూర్యనారాయణ, చంద్రశేఖర్ త్యాడి, భక్తులు పాల్గొన్నారు. కాశీబుగ్గ పల్లివీధికి చెందిన రామభక్తులు నర్సింహమూర్తి తయారు చేసిన 25 అడుగుల భారీ అగరుబత్తి ఆకట్టుకుంది. సర్వేకర్రతో దీన్ని తయారు చేసి శ్రీరామనవమినాడు దీన్ని వెలిగించారు. ఈదురాపల్లి గ్రామంలో ఉన్న షిరిడి సాయి ధ్యానమందిరంలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. నామ సంకీర్తన ఉదయం మూడు గంటలకే ప్రారంభమైంది. జె సి హెచ్ శ్రీనివాస్‌చే శ్రీరాముని గుణగణాల విశిష్టను వివరించారు. ఈ కార్యక్రమం లోకనాథం, కృష్ణారావు, చంద్రమౌళి, ధనుంజయ, 150 మంది భక్తులు పాల్గొన్నారు.





## వైభవం.. సీతారాముల కల్యాణం

**ఆమదాలవలస:** శ్రీరామనవమి ఉత్సవాలు లొద్దలపేట కలివరం, కొత్తవ లస, తోటాడ, వంజంగి, జీకేవలస, రామచంద్రాపురం నిర్వహించారు. కలివరం, కొత్తవలస గ్రామాల్లో ఆలయాలు వద్ద హరికథ కాలక్షేపాన్ని 9 రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. లొద్దలపేట సీతారామా ఆలయంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. వంద మంది దంపతులు స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణకు ఆలయ కమిటీ సభ్యులు, పైడి యోగేశ్వర రావు శిగిలిపల్లి ఆర్థిక సహాయం అందించారు.

**కోటబొమ్మాళి:** ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో సీతారామకళ్యాణ వేడుక లు నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ సుసరాపు చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో 30జంటలతో కళ్యాణాన్ని కనులుపండుగగా జరిపించారు. మధ్యాహ్నం ఐదు వేలు మందికి అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సనపల కరుణ్‌కుమార్, హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతిరావు, నేతింటి వెంకటరావు పాల్గొన్నారు. చిన్నహరిశ్చంద్రపురం రామ మందిరంలో పూజారి సత్యన్నారాయణ దంప తులచే సీతారామ కళ్యాణం నిర్వహించారు. గంగరాం, వెంకన్నపేట, యలమంచిలి, చిట్టేవలస, చవితిపేట, సుబ్బారావుపేట, కోటబొమ్మాళి గ్రామాలకు చెందిన పలు శ్రీరామమందిరాలు, రామాలయాల్లో నవమి వేడుకలు జరుపుకున్నారు.

**కవిటి:** మండలంలోని అన్ని ప్రాంతాల్లో శ్రీరామనవమి పూజా కార్య క్రమాలు ఘనంగా జరిగాయి. డొంకపుట్టుగలో గ్రామస్తుల ఏర్పాటుచేసిన నవమి వేడుక పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఆయన సతీమణి మాజీ ఎంపీపీ చామంతి దంపతులు పూజలు నిర్వహించారు. బోరువంకలోని హాస్టల్ వీధిలో, దూగానుపుట్టుగా, బైరిపురం, రాజపురం, తదితర గ్రామాల్లో ఈ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.







**రాజాం:** వాసవినగర్‌లో శ్రీరామ నవమి వేడుకలు, కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. ఈశ్వర నారాయణ కాలనీ, బాబానగర్ కాలనీ వాసులు పాల్గొని అంగరంగ వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణ ఏర్పాటు చేశారు. వెంకట సూర్య దుర్గా కళ్యాణ మండపంలో యోగా గురువు బుస్కీ మాస్టారు ఆధ్వర్యంలో రాముల వారి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.





## శాశ్వత అన్నదానానికి లక్ష వితరణ

**అరసవల్లి, ఏప్రిల్ 6 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత స్రూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో శాశ్వత అన్నదాన పథకానికి శ్రీకాకుళం జిల్లావాసి వలివేటి శ్రీదేవి లక్ష రూపాయలను ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీకి ఆదివారం అందజేశారు. అంతకుముందు ఆమె స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. వారికి స్వామి వారి జ్ఞాపికను, ప్రసాదాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ అందజేశారు. అలాగే స్వామివారిని మాజీ మంత్రి కొట్టు సత్యన్నారాయణ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.1,12,600, పూజలు విరాళాల రూపంలో రూ.60521, ప్రసాదాల రూపంలో రూ.1,15,880 ఆదాయం వచ్చిందని ఈవో చెప్పారు.

## పురుషోత్తపురంలో శుభారట ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 6 (వార్త):** మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామంలో శుభారట ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మే 8 నుండి 12 వరకు భజగోవిందం నామ యజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ పూజలలో కొణతాల గణేష్, పప్పల గిరి, గాలి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వంతో ప్రత్యేక గుర్తింపు



**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** టీడీపీలో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గోవిందపురం పంచాయతీలో సభ్యత్వ కార్డులను వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణతో కలిసి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అధిష్టానం గుర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సీపాన గోపి, టీడీపీ సీనియర్ నాయకులు గొరకల విఘ్నేష్, పాలిన మోహనరావు, పాలిన చంద్రయ్య, రత్నాల తుంబనాథం, మెట్ట నారాయణ, వెంకటరావు, కృష్ణార్జున యువ సైన్యం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10న మెగా జాబ్‌మేళా

**పాతపట్నం, ఏప్రిల్ 6 (వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో ఈనెల 10న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగులు ఈ మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

## వైన్ షాప్ వద్ద వాగ్వివాదం

**మెళియాపుట్టి, ఏప్రిల్ 6 (వార్త):** చాపర గ్రామానికి చెందిన నలుగురు యువకులు వైన్ షాప్ వద్దకు మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చి మద్యం షాపులో పనిచేస్తున్న మెళియాపుట్టి గ్రామానికి చెందిన బోను ఢిల్లీతో వాగ్వివాదానికి దిగి తలకు బలంగా గాయపరిచారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు స్థానిక ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## స్వచ్ఛభారత్‌పై అవగాహన

**రేగిడి, ఏప్రిల్ 6 (వార్త):** జీఎంఆర్ఐటీ రాజాం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రేగిడి మండలం తాటిపాడు గ్రామంలో నిర్వహిస్తోన్న ఏడురోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా ఐదోరోజు ఆదివారం ముందుగా తాటిపాడు గ్రామంలో స్వచ్ఛత అంశంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో ప్రజలందరూ తమ ఇంటి పరిసరాలు, గ్రామాన్ని పరిశుభ్రం గా ఉంచుకోవడం తమ బాధ్యతగా గుర్తెరగాలని వాలంటీర్స్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు చేసిన నినాదాలు ప్రజలను ఆలోచింపజేశాయి. అనంతరం నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీయూపీ స్కూల్ పరిసరాల్లో పేరు కుపోయిన చెత్త, పిచ్చిమొక్కలను తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశా రు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ చెత్తను తీసివేసి శుభ్రం చేయడం పట్ల గ్రామస్థులు వారిని అభినందించారు. ఎన్ఎస్ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ డా. కేవీఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించారు.



## తడి, పొడిచెత్తపై అవగాహన

**మెళియాపుట్టి, ఏప్రిల్ 6 (వార్త):** మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధి గ్రామాల్లో తడి, పొడిచెత్తపై ఆదివారం పంచాయతీ విస్తరణాధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యదర్శి ఊన శివాజీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తడి, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వ చేసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం చేసే ఫోనుకు ప్రతిఒక్కరూ స్పందించి సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**సోంపేట, ఏప్రిల్ 6 (వార్త):** సోంపేట మండలం చిన్న మామిడిపల్లి గ్రామం నుంచి పాతజాతీయ రహదారి, నుంచి చిన్న మామిడిపల్లి మీదుగా కొత్తపేట వరకు రూ.95 లక్షల నిధులతో కొత్తగా మంజూరైన తారు రోడ్డు నిర్మాణానికి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బాబు, జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్చార్జ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సురాడ చంద్రమోహన్ ఆదివారం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంజూరు చేసిన వేలాది కోట్లు రూపాయల వ్యయంతో రోడ్లు నిర్మించడం అభినందనీయమన్నారు. గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా అన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## రామనామమే మధురానుభూతి




సీతారాముల కృపా కటాక్షం మనందరిపై ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బాబు అన్నారు. శ్రీరామ నవమి పర్వ దినం సందర్భంగా సోంపేట మండలం ఎర్రముక్కాం గ్రామంలో రామాలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రిక్క నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం చాలా బాగుందని అన్నారు. అనంతరం రాముని పల్లకితో గ్రామంలో ఊరేగింపుగా తిరిగారు. అనంతరం చిన్న మామిడిపల్లిలో హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్ఛార్జి , యాదవ కార్పోరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురాడ చంద్రమోహన్ ,టీడీపీ కార్యకర్తలు, నాయకులు, టిడిపి సీనియర్ నాయకులు, భక్తులు టిడిపి అభిమానులు పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కారం

**మెళియాపుట్టి, ఏప్రిల్ 6 (వార్త):** ఇటీవల వెంకటాపురం పంచా యతీ పరిధి హడ్డివాడ గ్రామాన్ని సందర్శిం చిన ఎంపీడీవో వేసవి నేపథ్యంలో అడు గంటిన బోరుబావులు, బావులను పరి శీలించి స్థానికులకు మంచినీటి సౌకర్యాన్ని కల్పిస్తామని హామీనిచ్చారు. ఈ నేపథ్యంలో స్థానిక సర్పంచ్‌తో మాట్లాడి వాటర్ ట్యాంకును కొండమీదికి పంపించి వారి నీటి కష్టాన్ని తాత్కాలికంగా పరిష్క రించే దిశగా కృషి చేశారు. అనంతరం శాశ్వ తంగా నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు.

# ‘తెలుగు జాతి నిండు గౌరవం ఎన్టీఆర్’




**ఆమదాలవలస, ఏప్రిల్ 6(వార్త):** దివంగత నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి అనతి కాలంలోనే అధికారాన్ని చేపట్టి యావత్ తెలుగుజాతికి నిండు గౌరవం తెచ్చారని శాసనసభ పియుసి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా డలాస్ నగరంలో ఎన్నారై తెలుగు విభాగం వారు ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశేషాలకు మీడియాకు షేర్ చేశారు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించి బడుగు బలహీన వర్గాల అండగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి ప్రవేశించడంతో తెలుగువారికి గుర్తింపు లభించింది అన్నారు. తెలుగుదేశం జెండా ప్రపంచ నలుమూలల రెపరెపలాడడం ఆనందంగా ఉందన్నారు. అమెరికా డల్లాస్ మహానగరంలో తెలుగువారు తెలుగుదేశం పార్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళ్తున్నారని గుర్తు చేశారు. సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. టెక్నాలజీని అభివృద్ధి పరచడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేశంలోనే అగ్రగాముగా ముందున్నారని చెప్పారు. ప్రతి ఒక్క తెలుగు వారు జన్మభూమి రుణం తీర్చుకునేందుకు రాష్ట్ర అభివృద్ధి కొరకు పెట్టుబడులతోనూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి , కమ్యూనికేషన్ శాఖామంత్రి పెమ్మసాని చంద్రశేఖర తో కలిసి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం ఎన్నారై లతో కలిసి మాట్లాడారు.

# ‘రఘువంశం’ పుస్తకావిష్కరణ

**శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 6 (వార్త):** శ్రీరామ నవమి సందర్భంగా ఉపనిషన్ మందిరంలో కర్రీ భాస్కరరావు రచించిన రఘు వంశం పుస్తక ఆవిష్కరణ ఆదివారం చేశారు. ఈ సందర్భంగా ఉపనిషణ్ మందిరం ఉపాధ్యక్షులు శాస్త్రి, డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ కోమల్ రావు, విశ్వనాథం కామేశ్వర రావు, పైడి హరినాథ్, పట్నా యక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**రణస్థలం, ఏప్రిల్ 6 (వార్త):** రణస్థలం మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎచ్చెర్ల నియోజకవర్గం శాసనసభ్యు డు నడుకుదుటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా రామతీర్థం జంక్ష న్‌లో బీజేపీ పతాకాన్ని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ఆవిష్కరిం చారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తదనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అగ్రపథంలో నడిపిస్తూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తోన్న బీజేపీ పార్టీ లక్ష్యం వికసిత్ భారత్ అని, రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ స్వర్ణాంధ్రప్రదేశ్‌ను సాధించే దిశగా బీజేపీ కృషిచేస్తుందన్నారు. టీడీపీ సీని యర్ నాయకులు డీజీఎం.ఆనందరావు, పిసిని జగన్నా థం, లంక శ్యామలరావు, లంక ప్రభాకరరావు, రౌతు శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎచ్చెర్ల:** మండలంలోని అల్లినగరం గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మాడుగుల శ్రీనివాసరావు మాట్లాడు తూ, ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో అల్లినగరం బీజేపీ అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాసరావు, బూత్ అధ్యక్షులు మాడుగుల సన్యాశిరావు, భోగి గోవిందరావు, డొంక కూర్మారావు, మాడుగుల రామా రావు మాస్టార్ మహిళా మోర్చా అధ్యక్షురాలు సత్య వతి, పూంద్రు లక్ష్మి, దున్న సూర్యకుమారి, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పలాసలో ఉత్కళాంధ్ర కవి సమ్మేళనం

**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** జన జాగృతి సాహితీ సాంస్కృతిక సమాఖ్య సౌజ న్యంతో పలాస లైన్స్ క్లబ్ ఆవరణలో ఉత్క ళాంధ్ర కవి సమ్మేళనము జన జాగృతి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ అధ్యక్ష తన నిర్వహించారు. వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సాహి త్యాన్ని సజీవంగా ఉంచాలని లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించామని అన్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలుగు రచయితల వేదిక అధ్యక్షులు ఉత్తరవల్లి నాగేశ్వరరావు, లైన్స్ క్లబ్ రీజన్ వన్ చైర్ పర్సన్ ఉన్న వెంకట రంగనాథం, ప్రముఖ కవి వంకల రాజారావు, లయన్ షిందిరి మధుసూదనరావు, లయన్ కోదండ రామయ్యలకు జన జాగృతి ఘనంగా సత్కరించారు. కుమారి భాష్యం లక్ష్య శాస్త్రీయ నృత్యాన్ని, బాలక లోకనాథం హాస్యవల్ల రీ, మంగలి దండాసి ఏకపాత్ర అభినయనం, ఆహుతులను అలరించాయి. ప్రముఖ కవి బమిడి సుబ్బారావు నిర్వహణ సారథ్యంలో సమకాలిన సామాజిక అంశంపై స్వీయ కవితా పఠనము 34 మంది కవులతో నిర్వహించారు. జన జాగృతి అధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయ క్, వ్యవస్థాపక అధ్యక్షులు తెప్పల కృష్ణమూర్తి, లైన్ క్లబ్ అధ్యక్ష కోశాధి కారులు హె.వై .దొర., ఎన్. అప్పారావు, జన జాగృతి కార్యదర్శులు బి .బాలరాజు, ఉమామహేశ్వరి ,భాష్యం రవికుమార్, జయంతి గజలక్ష్మి, చిట్టిబాబు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546